


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

115

(19‘ జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"**క్రొత్త సంవత్సరంలో** ఎలాటిమార్పు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నావ్? అలా తెచ్చుకోవడం ఎందుకు అవసరంగా తోస్తోంది. ఆలోచించి వ్రాయి" అని మా మేనల్లుడికి ఉత్తరం రాశాను.

నాలుగురోజులకల్లా అతని వద్దనుంచి ఒక కార్డు వచ్చింది. దానిమీద రెండు ముక్కలే ఉన్నాయి. ‘జాలీవాక్, హాపీ టాక్.‘ అని. జీవిత వేదాంతాన్ని అతగాడు అంత చిన్నమాటల్లో పొదిగి వ్రాసినందుకు ఎంతో సంతోషించాను.

జాలీవాక్ వాడికి ఇదివరకే చేతనవును. మనిషి నిద్రలో లేపి ఎక్కడికి వెళ్ళమన్నా నిర్భయంగా, విసురుగా వెళ్ళిపోతాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా భార్యను వెంటబెట్టుకుని, టాక్సీ దొరికితే టాక్సీలో, రిక్షా దొరికితే రిక్షాలో అటు సికింద్రాబాద్ చివరవున్న మిత్రుణ్ణి చూడటానికో, ఇటు చార్మినార్ అవతల వున్న బంధువుల్ని చూడటానికో రివ్వున వెడుతూ ఉంటాడు.

అలా వెళ్ళడంలో రవంత విసుగుగాని, ఆదుర్దాగాని చూపించడు. టాక్సీలో వెడుతున్నా స్వంతకారులో కూర్చున్నంత ఠీవిగా కూర్చుంటాడు. డ్రైవరుకేవో సలహాలిస్తూనే వుంటాడు. ఇంకో విచిత్రమేమిటంటే వాడి అర్ధాంగి కూడా, అర్ధరాత్రి అనే భయంలేకుండా అతగాడి కంటే ధైర్యంగా బయలుదేరుతుంది. వాళ్ళ దాంపత్యంలో టెంపరరీగా కూడా ఎలాంటి మార్పులూ ఉండవు. జాలీవాక్ వాడి జన్మహక్కు.

హాపీటాక్ - వాడికి బాగా తెలుసు. ఏ సందర్భంలో చూసినా నవ్వుతూ బిగ్గరగా హాయిగా మాట్లాడుతూ ఉంటాడు. అతగాడు ఇంజనీర్. కూలీతో మాట్లాడినా, పై అధికారితో మాట్లాడినా ఒకే రకం సంతోషం ప్రకటిస్తాడు. వారికి మంచి సలహాలిచ్చి అవసరమైతే ఆ మంచి పని తనే చేసి అలాగ్గా వారి మనస్సులు దోచేస్తాడు.

ఇటీవల వాణ్ణి చూడటానికి వాళ్ళ ఇంటికి వెడితే వాళ్ళ ఆఫీసులో వున్నంతమందిని పిలుచుకు చక్కా వచ్చాడు.

వాళ్ళందరికీ ఒక ప్రక్క నన్ను పరిచయం చేస్తూ ఇంకో ప్రక్క పెద్ద టీ పార్టీ ఏర్పాటు చేశాడు. కొందరు ఆషామాషి ఫానులనీ, కొందరు నే వ్రాసిన చక్రపాణి ఫాన్సు అనీ కొందరు తన ఫాన్సు అనీ పరిచయం చేశాడు.

రాత్రి ఎనిమిది గంటలవేళ అందులో కోల్డ్‌వేవ్‌లో అందర్నీ ఆరుబయట కూర్చోపెట్టి, చలి మరచిపోయేటట్లుగా చక్కగా మాట్లాడాడు. చివరకు అన్నాడు "మా మామయ్యలాగా నేను కూడా సారస్వత సేవలో మునగాలని చూశాను. చిన్నప్పుడు కొంత కృషి చేశాను. కానీ వచ్చి ఇంజనీరింగ్ శాఖలో పడ్డాను. అయినా మామయ్యను చూసినప్పుడు మనస్సు కవిత్వం మీదకు పోతుంది" అని.

నాకూ ఒక మేనల్లుడు కవిత్వం వ్రాస్తే బాగుండుననిపిస్తూ ఉంటుంది. వాళ్ళలో కొందర్ని ఆ విధంగా చెడగొట్టాలని ప్రయత్నించానుగాని ఎవరూ నావలలో పడలేదు. లేకపోతే మల్లనగారికి మల్లే నాకూ ఒక కవి మేనల్లుడుండేవాడే

ఇంతకీ చెప్పవచ్చింది 'జాలీవాక్ - హాపీటాక్' అనే మా వాడి స్లోగను నాకెంతగానో నచ్చింది. చాలా మంది మానసిక శాస్త్రవేత్తలు ఈ సత్యాన్నే మరోవిధంగా వివరించి చెప్పారు. జీవితంలో నడకకూ, ఈ నడకకూ కొంత సామ్యం ఉంటుంది. ఆ అర్థంతో పై స్లోకం పరిశీలించాలనిపించింది.

జార్జి ఫ్రెగ్రెడో అనే ఆయన ఈ విషయంలో వ్రాస్తూ నీ గమ్యం నిర్ధారణ చేసుకున్నట్లు నువ్వక్కడకు చేరేవరకూ నిద్రపోయినట్లు - గబగబా నడిచి పోవడం అలవరచుకో. ఆగి వెనక్కి చూచుకోవడం అలవాటు చేసుకోబాకు. ఎక్కడా తూలకు. నడుస్తూ ఎటూ వ్రాలక నిటారుగా నిలిచి సుశిక్షితుడైన సైనికుడిలాగా ముందుకు సాగాను.

"ఒక తప్పటడుగు అంతులేని అపజయం సమకూరుస్తుంది. ఎప్పుడు ఎవరు నీ వంక చూసినా ధృఢవిశ్వాసంగల వ్యక్తిలాగ సాక్షాత్కరించు. అలాకనిపించడంలో ఎంత శక్తి ఉందో గ్రహించు. ముందుకు సాగు. సంతోషంగా సాకు. విజయోత్సాహంతో సాగు" అన్నాడు. మావాడు దీన్నే జాలీవాక్ అన్నాడేమో?

అంతా నిబ్బరంగా జీవితం సాగించాలంటే ఎంత ప్రయత్నం కావాలి, మా బంధువుల్లో ఒకావిడ భర్తను గురించి "ఆయన నడక సంగతే చెప్పాలి. అన్నీ హై జంపులూ, లాంగ్ జంపులూ. నేలమీద పది అడుగులు వరసగా వేసిన పాపాన పోలేదింతవరకూ చాలామంది ఆయన్ని 'ఖంగారు టైపు' అంటారు. అంటే మాత్రం వినిపించుకుంటారా?" అన్నది అతి విసుగ్గా.

చాలామంది జీవితంలో కదలికలేకుండా ఎవరో వచ్చి "తుమ్మిండా" పెట్టినట్లు కూర్చుంటారు. వారికి నడకే ఉండదు. ఇంకా సంతోషమైన నడక ఎక్కడిది? కొందరు సిరివున్నా, సంపదవున్నా ఇంట్లో కుంటినడకల నడుస్తూ ఉంటారు. ఇలాంటివాళ్ళను గురించి చెప్పేటప్పుడు కూసాలు లేని కుంటి నడకలు అంటారు.

కొందరు అనుమానగ్రస్తులుంటారు. ప్రతి అడుగులోనూ వారికి అనుమానాలే. ఒక అడుగువేసి, వెనక్కు చూసి, ముందుకు అడుగు పడక - ముల్లు గ్రుచ్చుకున్నవాడిలాగా మూల్గుతూ కూలపడతారు. ముచ్చెమటలు పట్టి చచ్చినట్లు వెనక్కి తిరిగి వస్తాయి. ఇలాంటి వాళ్ళను "ఏకవాదులు" అంటారు.

ఉద్యోగాలలో పడి జీవితాన్ని దానికి అంకితం చేసుకున్న వాళ్ళల్లో కొందరు ఆఫీసు, ఇంటిమధ్యనే సంచారం చేస్తూ ఉంటారు. అంటే వాళ్ళు ఇంట్లో ఉన్నంత సేపూ ఆఫీసు సంభాషణలు. ఆఫీసులో అడుగు పెట్టినప్పటినుంచీ ఇంటి సంభాషణలు.

మా ఆవిడ ఇవ్వాళ గారెలు చేసి పంపింది. పచ్చిమిరపకాయలు పచ్చడి పంపింది. కరకరలాడాయి ఏమో, ఇవ్వాళ మా ఆవిడ సినిమాకు రమ్మంది. అయిదింటికే వెళ్ళాలేమో, ఇవ్వాల మా యింట్లో అద్దెకు వున్నవాడికీ నాకూ యుద్ధమైందనో ఏదో చెపుతూనే ఉంటారు. ఇంటినెక్కడ మరిచిపోతామో, ఇల్లాలినెక్కడ మరిచిపోతామోనన్న దిగులుతో, ఇలాటి వారికి జీవితంలో ఇతర విషయాలేమీ స్ఫురణకు రావు. ఇలాటి వారికి జీవితంలో ఇతర విషయాలేమీ స్ఫురణకు రావు. ఇలాంటి వాటివి "షటిల్ సర్వీసు" నడకలంటారు.

కొందరు సాయంత్రంపూట బెదురు జంతువుల్లాగా ఇళ్ళకు పరుగెత్తుతూ ఉంటారు" ఏమిటి అంత తొందరగా వెడుతున్నారు?" అంటే "ఎనిమిదింటికల్లా ఇంటిదగ్గర ఉండాలి. అది మా ఆవిడతో పెట్టుకున్న షరతు" అంటాడు భయంతో వణుకుతూ.

ఆ సమయంలో ఎలాటి మిత్రుడూ కనిపించిన వదిలి పారిపోతాడు.

ఎలాటి పనివున్నా "రేపు చూద్దాంలే అని అక్కరలేని దిక్కుమాలిన వాయిదావేసి పారిపోతాడు. గడియారం ముల్లుకు జడిసే చిల్లర నడకలు నడుస్తాడు. ఇలాటి వాళ్ళని 'టైంటేబుల్' నడకలుంటారు.

జార్జి ఫ్రెగ్రెడో ఇలాటి వాళ్ళను మనస్సులో పెట్టుకునే వ్రాశాడు. "నువ్వు గడియారానికి దాసుడవు కావద్దు. ఏ రైలు ప్రయాణమో, బస్సు ప్రయాణమో, పెద్దల్ని చూడటమో తటస్థించినప్పుడు తప్ప రిస్టువాచి మీదకు దృష్టిపోనియ్యకు.

గడియారం వంకచూసి వినడం, దానివంక చూస్తూ మాట్లాడడం, దాన్ని చూసి పిచ్చి పరుగులు తీయడం వంటి అలవాట్ల వల్ల నువ్వు అవహేళన పాలవుతావు. గడియారాన్ని నువ్వు తిప్పుతున్నట్లుండి, దాని ముల్లుతోపాటు నువ్వు తిరగడం, అలవాటు చేసుకోకు. అలా చేసుకోవడం వల్ల కొన్ని మహత్తరమైన అవకాశాలు పోతాయి. మందభాగ్యుడవై పోతావు" అని.

ఇలాటి రకాల నడకలూ ఉంటాయి జీవితంలో. వీటినన్నింటిని అధిగమించి 'జాలివాక్' అలవరచుకోవడం ఎంతమంచిది.

Post your comments